బయట వ్యక్తులు ప్రవేశించకుండా చర్యలు

ఆశ్రమ పాఠశాల సిబ్బందికి పీవో ఆదేశం



హుకుంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోకి బయట వ్యక్తులు ప్రవేశించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఉపాధ్యాయులను ఆదేశించారు. పెదగరువు బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. అంతకుముందు ఓల్డా,రాప,రంగశీల,సంతారి గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. విధులు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.



పెండింగ్ లేకుండా ఉపాధి చెల్లింపులు

ఉపాధి కూలీలకు పెండింగ్ లేకుండా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని డ్వామా పీడీ రమేష్‌రామన్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

పీఎల్‌జీఏ వారోత్సవాలను వ్యతిరేకిస్తున్న గిరిజనులు

ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్



చింతపల్లి: మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాలను గిరిజనులు వ్యతిరేకిస్తున్నారని స్థానిక ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యమాల పేరిట జీవితాలు నాశనం చేసుకోకూడదని వారు తెలుసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే పెదవలసలో శాంతి స్థూపం ఆవిష్కరించారని ఆయన చెప్పారు. ప్రజలకోసం పనిచేయాలనుకుంటే అనేక మార్గాలు ఉన్నాయని, తుపాకులు పట్టుకుని అడవుల్లో తిరగనవసరం లేదన్నారు. వారోత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా బలగాలు మోహరించామని, బాంబ్‌స్క్వాడ్లు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాయని తెలిపారు. చింతపల్లిలో ఇటీవల నిర్వహించిన సదరం శిబిరానికి 1,500 మంది హాజరు కాగా, 470 మందికి గుర్తింపు పత్రాలు అందజేసినట్టు చెప్పారు. త్వరలో ఉచిత మెగా వైద్యశిబిరాలు, వాలీబాల్ పోటీలు, డ్రైవింగ్ లైసెన్స్‌ల మేళా నిర్వహిస్తామన్నారు. మావోయిస్టుల కార్యకలాపాల్లో పాల్గొన వద్దని ఆయన గిరిజనులను కోరారు.

'చిరుత సంచారం'పై ఆరా



చిరుత సంచరించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రేంజ్ ఆఫీసర్

గంగవరం: ఫోక్స్‌పేట ఫారెస్టు రేంజ్ పరిధిలో అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్టు వచ్చిన సమాచారంపై ఫోక్స్ పేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కరుణాకర్ శనివారం ఆరా తీశారు. ఆముదాల బంద గాలివాన డొంక వద్ద శుక్రవారం చిరుత సంచరించినట్టు వార్తలు రావడంతో రేంజ్ ఆఫీసర్ కరుణాకర్ బృందం శనివారం ఆముదాలబంద అటవీ ప్రాంతాన్ని సందర్శించి, గిరిజనులను విచారించింది. ఈ సందర్భంగా కరుణాకర్ విలేకరులతో మాట్లాడుతూ ఆముదాలబంద అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న జంతువు పాదముద్రలను బట్టి చిరుతగా గుర్తించామన్నారు. పెద్దపులి సంచరిస్తున్నట్టు వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దన్నారు. ఆయన వెంట అటవీశాఖ ఎఫ్‌బీవోలు జగదీష్, మనోహర్, ప్రశాంత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నిరంతరాయంగా.. వెలుగులు

- రూ.38 కోట్లతో 220/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం
- ప్రకృతి విపత్తుల్లోనూ నిరంతర విద్యుత్
- ఇప్పటి వరకు చింతూరు, కూనవరం, వీఆర్ పురం మండలాలకు సరఫరా
- త్వరలో ఎటపాక మండలానికి..
- ముమ్మరంగా పనులు

చింతూరు: విలీన మండలాల్లో చీకటి కష్టాలు తొలగుతున్నాయి. ఇప్పుడు మూడు మండలాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఎటపాక మండలానికి పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేసేందుకు పనులు చురుగ్గా సాగుతున్నాయి.

గతంలో తరచూ అంతరాయం

ముంపు మండలాలకు డివిజన్ కేంద్రమైన చింతూరు మండలంలోని పొల్లూరులో 460 మెగావాట్ల విద్యుదుత్పత్తి అవుతున్నా ఇది వరకు నాలుగు మండలాల ప్రజలు తెలంగాణ విద్యుత్‌పైనే ఆధారపడాల్సి వచ్చేది. గతంలో చింతూరుకు 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎటపాకలో గాలి వీచినా, భారీవర్షం వచ్చినా చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్ పురం మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. సరఫరా పునరుద్ధరణకు ఒకటి నుంచి రెండ్రోజులు పట్టేది. వర్షాకాలంలో భద్రాచలంలో గోదావరి వరద 53 అడుగులు దాటితే కూడా నాలుగు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసేవారు. వరదల సమయంలో ఒక్కోసారి వారం నుంచి పది రోజుల పాటు నాలుగు మండలాల ప్రజలు చీకటిలోనే కాలం గడపాల్సిన పరిస్థితులు నెలకొనేవి. వీరి విద్యుత్ కష్టాలను దూరం చేసేందుకు చింతూరులో రూ.38 కోట్లతో 220/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం ప్రారంభించారు.కరోనా తదితర కారణాలతో కొంత కాలం పాటు పనులు నిలిపివేశారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శరవేగంగా పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఇటీవల నాలుగు మండలాల్లో సంభవించిన వరదల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.

10 రోజుల పాటు విద్యుత్ సరఫరా లేకపోవడంతో వరద బాధితులతో పాటు అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరదల సమయంలో చింతూరులోనే మకాం వేసి సహాయక చర్యలను పర్యవేక్షించిన కలెక్టర్ సుమిత్ కుమార్ విలీన మండలాల చీకటి కష్టాలను దగ్గరుండి చూశారు. దీంతో ఆయన ప్రత్యేకశ్రద్ధ తీసుకుని సబ్‌స్టేషన్ త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు చేపట్టారు.

విద్యుత్ సరఫరా ఇలా

గతంలో తెలంగాణలోని సీతారామపట్నం నుంచి ఎటపాకలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా జరిగేది. అక్కడినుంచి పురుషోత్తపట్నం, నెల్లిపాక, కూనవరం, సరివెల, చింతూరు సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా అయ్యేది. కాగా ఇప్పుడు చింతూరు మండలంలోని పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం నుంచి తెలంగాణకు వెళ్లే 220 కేవీలైన్ ద్వారా చింతూరులో కొత్తగా నిర్మించిన 220/33 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా ఇచ్చారు. ఇక్కడి నుంచి చింతూరు మండలంలోని సరివెల, కూనవరం, నెల్లిపాక, పురుషోత్తపట్నం సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు చేపట్టారు. మొదట్లో చింతూరు సబ్‌స్టేషన్‌కు మాత్రమే విద్యుత్ సరఫరా చేసేవారు. అనంతరం కూనవరం, వీఆర్ పురం మండలాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఎటపాక మండలానికి కూడా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు. త్వరలో పనులు పూర్తి చేసి, విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. నాలుగు మండలాల్లో చింతూరు, కూనవరం, నెల్లిపాక సెక్షన్లుండగా ఐదు సబ్‌స్టేషన్లున్నాయి. నాలుగు మండలాల్లో 110 కిలోమీటర్ల మేర విద్యుత్ సరఫరా జరుగుతుండగా 2,200 విద్యుత్ స్తంభాలున్నాయి. చింతూరు నుంచి నాలుగు మండలాల్లో విద్యుత్ సరఫరా ద్వారా ప్రతినెలా డిమాండ్‌ను బట్టి రూ.కోటి వరకు ఆదాయం వస్తోంది.



చింతూరులో కొత్తగా నిర్మించిన సబ్ స్టేషన్

మండలాల్లో విద్యుత్ కనెక్షన్ల వివరాలు

సెక్షన్	కేటగిరీ-1	కేటగిరీ-2	ట్రాన్స్‌ఫార్మర్లు
చింతూరు	8,978	621	367
కూనవరం	13,353	519	389
నెల్లిపాక	10,291	256	576
	32,622	1,396	1,332

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

విలీన నాలుగు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాం. చింతూరులో కొత్తగా నిర్మించిన 220/33 కేవీ సబ్‌స్టేషన్ ద్వారా సరఫరా చేస్తున్నాం. ప్రకృతి విపత్తుల సమయంలో కూడా ఈ సబ్‌స్టేషన్ ద్వారా ఆటంకం లేకుండా విద్యుత్ సరఫరా జరుగనుంది.

– కాట్రు మలాకీ, ఈపీడీసీఎల్ ఏడీఈ, చింతూరు

ఉత్సాహంగా జగనన్న క్రీడా సంబరాలు



బహుమతులు అందజేస్తున్న డీఈవో రమేష్

పాడేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జగనన్న జిల్లా స్థాయి క్రీడా సంబరాలు శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డీఈవో పి.రమేష్ ప్రారంభించారు. నవంబర్ 28,29 తేదీల్లో నిర్వహించిన నియోజకవర్గస్థాయి పోటీల్లో ప్రతిభచూపిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించారు. తొలిరోజు వాలీబాల్, కబడ్డీ(పురుషులు) పోటీలు నిర్వహించారు. వాలీబాల్‌లో పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాలకు చెందిన జట్లు తలపడ్డాయి. వీరిలో అరకు విన్నర్‌గా, రంపచోడవరం రన్నరప్‌గా నిలిచాయి. ఆదివారం ఇదే మైదానంలో క్రికెట్(పురుషులు), కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులకు డీఈవో రమేష్ బహుమతులు అందజేశారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.జగన్మోహన్‌రావు, జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి పి.సూరిబాబు పాల్గొన్నారు.



కబడ్డీలో హోరాహోరీగా తలపడుతున్న జట్లు

పకడ్బందీగా రీసర్వే

సబ్ కలెక్టర్ శుభం బన్సాల్


గంగవరం : రెవెన్యూ, సర్వే సిబ్బంది సమన్వయంతో పకడ్బందీగా రీ సర్వే నిర్వహించాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సాల్ తెలిపారు. ఎండపల్లి పంచాయతీలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం వేగంగా, విజయవంతంగా పూర్తి చేసేందుకు రైతులు సహకారం అందించాలన్నారు. ఎటువంటి లోపాలు లేకుండా రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. తహసీల్దార్ పరిధిలో పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. మూడు పంచాయతీల్లోని ఆరు గ్రామాల్లో నూరు శాతం రీసర్వే పూర్తి చేశామని, ప్రస్తుతం ఎండపల్లి, మోహనాపురం గ్రామాల్లో సర్వే జరుగుతోందని తహసీల్దార్ శ్రీమన్నారాయణ సబ్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఇ.రామవరంలో పోలింగ్ కేంద్రాన్ని సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఓటరు నమోదు వివరాలను బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. జడేరు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి, ధాన్యం కొనుగోలు కేంద్రంపై రైతులకు అవగాహన కల్పించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మండలంలో మూడు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ ఈ సందర్భంగా సబ్ కలెక్టర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జిలానీ, ఎండపల్లి సర్పంచ్ బండారు రామలక్ష్మి, వీఆర్వో వెంకటేశ్వర్లు దొర, మండల సర్వేయర్ దొర తదితరులు పాల్గొన్నారు.



సర్వేపై అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ఓపెన్ డిగ్రీ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్

- సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలో బయటపడిన వ్యవహారం
- ఆగ్రహం వ్యక్తం చేసిన ఫర్మాన్ అహ్మద్‌ఖాన్
- పరీక్ష రద్దు, యాజమాన్యంపై కేసు నమోదు



పరీక్షా పత్రాలను పరిశీలిస్తున్న చింతూరు సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

వీఆర్‌పురం: స్థానిక ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన ఓపెన్ డిగ్రీ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ జరగడంతో చింతూరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సీరియస్ అయ్యారు. సంబంధిత కళాశాలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతో పాటు యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. వీఆర్ పురంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో 250 మంది విద్యార్థులు ఓపెన్ కేటగిరీలో స్కిల్ డెవలప్‌మెంట్ పరీక్ష రాస్తున్నారు. అదే సమయంలో సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆకస్మికంగా కళాశాలకు వెళ్లి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షల్లో భారీగా మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్టు గమనించి యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఈ విషయాన్ని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎగ్జామ్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన దీనిపై విచారణకు రీజనల్ కో ఆర్డినేటర్‌ను వీఆర్‌పురం పంపించారు. మాస్ కాపీయింగ్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సబ్ కలెక్టర్.. శనివారం జరిగిన పరీక్షను రద్దు చేసి, తిరిగి షెడ్యూల్ ప్రకటించి పరీక్ష నిర్వహించాలని ఆదేశించారు. దీంతోపాటు ఇంతకుముందు జరిగిన పరీక్షలపై విచారణ నిర్వహించడంతో పాటు ఇకపై జరిగే పరీక్షలను నిశితంగా పర్యవేక్షించాలని రీజనల్ కో ఆర్డినేటర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ చింతూరులో విలేకరులతో మాట్లాడుతూ ఈ కళాశాలలో ఇకపై పరీక్షలు నిర్వహించకుండా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతో పాటు యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని ఆదేశించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్ పురం తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో ఫణీంద్ర పాల్గొన్నారు.

నేడే నౌకా దళ వేడుక

- సిద్ధమైన సాగర తీరం
- హాజరవుతున్న భారత రాష్ట్రపతి
- అలరించనున్న సాహస విన్యాసాలు

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నౌకాదళం అంటే శత్రు దేశాల వెన్నులో వణుకు పుడుతుంది. 1971లో పాకిస్తాన్‌లోని కరాచీ పోర్టుపై దాడి చేసి విజయ పతాక ఎగురవేసిన చరిత్ర తూర్పు నౌకా దళానిది. ఈ విజయానికి గుర్తుగా ఏటా డిసెంబర్ 4న సాగరతీరంలో నావికా దళ దినోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా వేడుకలకు విశాఖ సాగరతీరం సర్వం సిద్ధమైంది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో.. నగరం మొత్తం 5400 మంది పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశారు. యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు, జెట్ ఫైటర్స్, జెమిని బోట్లు సాహస విన్యాసాల్లో పాల్గొననున్నాయి. ఇప్పటికే తూర్పు నావికా దళం నిర్వహించిన రిహార్సల్స్ ఆకట్టుకున్నాయి. ఆదివారం నిర్వహించే నావికాదళ విన్యాసాలు వీక్షించేందుకు నగర వాసులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో ప్రజలు, పర్యాటకులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా నేవీ, జిల్లా యంత్రాంగం, జీవీఎంసీ పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఆర్.కె. బీచ్ నుంచి వైఎంసీఏ వరకు వివిధ గ్యాలరీలు ఏర్పాటు చేశారు. మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రతి గ్యాలరీ నుంచి విన్యాసాలు చూసేందుకు వీలుగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. తీరం మొత్తం సుందరంగా తీర్చిదిద్దారు. సాగరతీరంతో పాటు నగరంలోని పలు ప్రాంతాలను విద్యుత్ కాంతులతో అలంకరించారు.



విశాఖ బీచ్‌రోడ్డులో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న నేవీ, పోలీసు అధికారులు



బీచ్ రోడ్డులో కాన్వాయ్ ట్రయల్‌రన్

రాష్ట్రపతి పర్యటనకు పటిష్ట భద్రత

- 5,400 మందితో భారీ బందోబస్తు
- విశాఖ నగరంలో అన్ని ప్రాంతాలను జల్లెడపట్టిన ప్రత్యేక నిఘా బృందాలు

దొండపర్తి(విశాఖ దక్షిణ): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖ పర్యటన సందర్భంగా పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. బీచ్‌రోడ్డులో ఆదివారం జరిగే నేవీ డే వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆమె పర్యటన నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ నేతృత్వంలో పోలీస్‌శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు చేపట్టింది. రాష్ట్రపతి పర్యటన సజావుగా సాగడంతో పాటు వేడుకలకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సుమారు 5,400మంది అధికారులు, సిబ్బందితో ఈ బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. ఇతరజిల్లాల నుంచి అధికారులు, సిబ్బందిని బందోబస్తు, ఇతర ఏర్పాట్ల పర్యవేక్షణ నిమిత్తం విశాఖకు రప్పించారు.

బందోబస్తు ఇలా..

- ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బందితో పికెట్స్, చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. రోప్ పార్టీలతో ప్రముఖులకుభద్రతకల్పిస్తున్నారు.
- వారం రోజులుగా బాంబు డిస్పోజ్ సిబ్బంది, ఏపీఎస్పీ, ఆర్‌పీఎఫ్, స్నిఫర్ డాగ్ బృందాలు నగరమంతా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాయి.
- ఎంటీ(మోటార్ ట్రాన్స్‌పోర్టు) సిబ్బందిని కాన్వాయ్‌లకు, వీఐపీ వాహనాలకు వినియోగించారు.
- స్పెషల్ ఫోర్సెస్(గ్రేహౌండ్స్, ఏపీఎస్పీ, ఆక్టోపస్) సిబ్బందిని ఏరియా డామినేషన్, ఎమర్జెన్సీ, క్విక్ రియాక్షన్ బృందాలను అత్యవసర పరిస్థితులకు గానూ రంగంలోకి దించారు.
- సమర్థవంతంగా కమ్యూనికేషన్ కోసం ఆ శాఖకు చెందిన సిబ్బందిని ఏర్పాటు చేశారు.
- ట్రాఫిక్ అంతరాయాలు జరగకుండా ముఖ్య జంక్షన్ వద్ద స్థానిక అధికారులను నియమించారు. సభ జరిగే ప్రదేశం, వీఐపీలు పర్యటించే ప్రాంతాలు, నేవీ డేకు వచ్చే వాహనాలతో పాటు నగర ట్రాఫిక్‌ను పూర్తిగా నియంత్రించేందుకు ట్రాఫిక్ సిబ్బందితో ఏర్పాట్లు చేశారు.
- లా అండ్ ఆర్డర్ సిబ్బందితో ఎయిర్ పోర్టు, ఐఎన్ఎస్ డేగ, ఐఎన్ఎస్ చోళ, వీఐపీలు ప్రయాణించే రహదారుల వెంట భద్రత ఏర్పాట్లు చేశారు. నేవీ డే జరిగే వేదిక వద్ద, బీచ్‌రోడ్‌లో ప్రజలు వీక్షించే ప్రాంతాలన్నీ రూఫ్ టాప్ సెక్యూరిటీగా బీచ్‌రోడ్డులో ఉన్న ప్రతి భవనంపై, నగరంలోని ఇతర ముఖ్య ప్రాంతాల వద్ద భద్రత ఏర్పాట్లు చేశారు.
- డీసీపీ(క్రైం) జి.నాగన్న ఆధ్వర్యంలో ఏసీపీ(క్రైం) పెంటారావు నేతృత్వంలో నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని హోటళ్లు, లాడ్జీలు, రిసార్ట్, గెస్ట్ హౌస్‌లలో విస్తృత తనిఖీలు నిర్వహించారు.

నేడు కబడ్డీ జట్ల ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర కబడ్డీ సబ్‌జూనియర్ జట్లను ఆదివారం ఎంపిక చేయనున్నారు. రైల్వే స్టేడియం కబడ్డీ కోర్ట్‌లో ఉదయం తొమ్మిది గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభం కానున్నాయి. విశాఖ జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో తొలుత జిల్లా జట్టుకు ఐదుగురు చొప్పున బాల బాలికలను ఎంపిక చేస్తారు. అనంతరం రాష్ట్ర జట్టు ఎంపిక జరగనుంది. ఈ నెల 27 నుంచి జార్ఖండ్‌లో అంతర్రాష్ట్రాల సబ్‌జూనియర్ పోటీలు జరగనున్నాయి.

గూడ్స్ రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

అనకాపల్లిలో రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదం


కోటేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శాంతారామ్, ఆర్పీఎఫ్ సిబ్బంది

అనకాపల్లి టౌన్: స్థానిక రైల్వే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఢీకొని వృద్ధుడు దుర్మరణం చెందాడు. దువ్వాడ రైల్వే జీఆర్పీ ఎస్ఐ శాంతారామ్ వివరాల మేరకు... ఒడిశా రాష్ట్రం రాయగడకు చెందిన దాడి కోటేశ్వరరావు(65) కుటుంబ సభ్యులతో కలిసి అనకాపల్లి టౌన్‌లోని గవరపాలెంలో తన సోదరుడు కుమారుడు వివాహం నిమిత్తం గురువారం వచ్చాడు. వివాహం అనంతరం శనివారం ఉదయం రాయగడ వెళ్లేందుకు బయలుదేరాడు. ఈ క్రమంలో అనకాపల్లి గూడ్స్ షెడ్ నుంచి 2, 3 ప్లాట్‌ఫాంకు వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతుండగా, విశాఖ నుంచి విజయవాడ వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

విస్తృతంగా పోలీసు తనిఖీలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం వారపు సంతలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జోలాపుట్టు, డుడుమ, కుమడ మార్గాల నుంచి వచ్చే ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీ బస్సులను స్థానిక ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో సోదాలు చేశారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించి విడిచిపెట్టారు. మావోయిస్టుల వారోత్సవాలతో ఏవోబీలో పోలీసులు అప్రమత్తమై తనిఖీలను ముమ్మరం చేశారు. మాచ్‌ఖండ్, జోలాపుట్టులో బీఎస్ఎఫ్ బలగాలు సరిహద్దులో రాకపోకలపై పూర్తిగా దృష్టి సారించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు.

పెండింగ్ లేకుండా ఉపాధి చెల్లింపులు

డ్వామా పీడీ రమేష్‌రామన్

చింతూరు: జిల్లాలోని ఉపాధి కూలీలకు పెండింగ్ లేకుండా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని డ్వామా పీడీ రమేష్‌రామన్ తెలిపారు. చింతూరు మండలంలో 2020-21, 2021-22 సవంత్సరాల్లో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి నిర్వహించిన 12,13వ విడతల సామాజిక తనిఖీపై శనివారం ప్రజావేదిక జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీడీ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 86 లక్షల పనిదినాలు కల్పించాలనేది లక్ష్యంకాగా, ఇప్పటికే 90.45 లక్షల పనిదినాలు కల్పించినట్టు చెప్పారు. జిల్లాలో 2.18 లక్షల జాబ్‌కార్డులున్నాయని, డుంబ్రిగుడ, అనంతగిరి, జి.మాడుగుల మండలాల్లో ఇప్పటికే సామాజిక తనిఖీ ప్రక్రియ పూర్తి చేసినట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉపాధి కూలీలకు రూ.230 చొప్పున సరాసరి వేతనం లభిస్తోందని, ఇకముందు రూ.257 వేతనం లభించేలా చర్యలు తీసుకుంటామని పీడీ వివరించారు. ప్రస్తుతం జిల్లాలో ఉపాధిహామీ కింద 51 వేల పనులు జరుగుతున్నాయని, మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా పనులు చేపడతామని చెప్పారు. ఉపాధి పనులు చేసి ఎవరైనా మృతిచెందితే వారి కుటుంబ సభ్యులకు ఆ సొమ్ము అందేలా చర్యలు చేపట్టాలని, పోస్టల్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆయన ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు మస్టర్ల విషయంలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పెండింగ్ లేకుండా సొమ్ము చెల్లించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న రహదారులకు అటవీశాఖ అభ్యంతరం చెబుతోందని ఈ విషయాన్ని ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. చింతూరు మండలంలో 2020 నుంచి 2022 వరకు నిర్వహించిన 1,439 పనులకు సంబంధించి రూ. 22.07 లక్షలు ఖర్చుచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ రోశయ్య, ఎంపీడీవో రవిబాబు, ఏపీవో రాజు, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటాం


విద్యార్థి సూరిబాబు మృతదేహం


విద్యార్థి మృతికి కారణాలను గ్రామస్తుల నుంచి తెలుసుకొంటున్న డీడీ కొండలరావు

జి.మాడుగుల: జ్వరంతో మృతి చెందిన డోకులూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థి సీదరి సూరిబాబు కుటుంబాన్ని ఆదుకుంటామని గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు చెప్పారు. గున్నమామిడిలో ఆయన శనివారం పర్యటించి, విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని, రూ.1లక్ష ఆర్థిక సహాయమందిస్తామని, సూరిబాబు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎక్స్‌గ్రేషియా కోసం ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామన్నారు. ఏటీడబ్ల్యూవో రజనీ, సీఐ సత్యనారాయణ, డోకులూరు ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం వేమచందర్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి


మృతి చెందిన విద్యార్థి శామ్యూల్

డుంబ్రిగుడ: గుంటసీమ పంచాయతీ సోబురు గ్రామానికి చెందిన చంద్రదాసు కుమారుడు శ్యాముల్ అనారోగ్యంతో పాడేరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబీకులు అందించిన వివరాల ప్రకారం విశాఖపట్నం ఆరిలోవ ఎంపీపీ పాఠశాలలో 6 వ తరగతి చదువుతున్న గెడ్డంగి శ్యామల్(7) అనారోగ్యంతో బాధపడుతుండంతో శనివారం ఉదయం పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించామని, పరిస్థితి విషమించి అక్కడే మృతి చెందినట్టు తెలిపారు. విషయం తెలుసుకున్న పంచాయతీ సర్పంచ్ నాగేశ్వరరావు కుటుంబీకులను పరామర్శించి మృతదేహాన్ని స్వగ్రామానికి చేరవేశారు.

బూరుగు భూములపై విచారణ


విచారణ చేస్తున్న ఆర్ఐ నల్లన్న, జెడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ చిరంజీవి తదితరులు

అనంతగిరి: రొంపల్లి పంచాయతీ బూరుగు గ్రామంలోని భూములపై తహసీల్దార్ ఆదేశాలతో ఆర్ఐ నల్లన్న శనివారం విచారణ చేపట్టారు. రెండు రోజులు క్రితం తమ భూములు అప్పగించాలని గ్రామస్తులు నిరసన తెలిపారు. శనివారం ఆర్ఐ నల్లన్న, వీఆర్వో శంకరరావు, సర్పంచ్ చిరంజీవి, జెడ్పీటీసీ గంగరాజుతో కలిసి బూరుగు గ్రామానికి వెళ్లి భూములపై సమగ్ర విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆర్ఐ తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ గ్రామంలో గిరిజనులకు చెందిన 63.48 ఎకరాలు భూస్వాముల పేరు మీదుగా మార్పు జరిగిందిన, దీనిపై విచారణ చేపట్టి, గిరిజనులకు న్యాయం చేసి, వారికి భూములు అప్పగించాలని కోరారు.

మంత్రి బొత్స సత్యనారాయణను కలిసిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


మంత్రి బొత్సను కలిసిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

సాక్షి,పాడేరు: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ కో-ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణను అల్లూరి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వం ఆమలుచేస్తున్న సంక్షేమ పథకాల సమగ్ర వివరాలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, మంత్రి బొత్స సత్యనారాయణకు వివరించారు.

బూదరాళ్ల సమస్యలపై స్పందించిన కలెక్టర్


కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి బయటకు వస్తున్న బూదరాళ్ల గ్రామ సచివాలయం సిబ్బంది

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీలో నెలకొన్న సమస్యలపై సచివాలయ సిబ్బంది ఇచ్చిన నివేదికను పరిశీలించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ వెంటనే స్పందించారు. ఇటీవల కలెక్టర్ రంపచోడవరం నుంచి పాడేరు వెళ్తూ మధ్యలో బూదరాళ్ల సచివాలయాన్ని సందర్శించారు. అక్కడ నెలకొన్న సమస్యలపై నివేదించాలని సిబ్బందిని ఆదేశించారు. దీనిపై సిబ్బంది కలెక్టర్‌ను కలిసి నివేదించారు. గ్రామంలో సుమారు 102 మందికి ఆధార్‌కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని, సిబ్బందిని శనివారం బూదరాళ్లకు పంపించారు. గ్రామంలో తాగునీటి సమస్యలను పరిష్కారిస్తామన్నారు. గ్రామంలో పలువురు ఖాతాదారుల సమస్యను పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశించారు. పలువురి ఖాతాలో రూ.10వేలు సొమ్ము జమ చేసి, వారి అకౌంట్‌ను పునరుద్ధరించారు. ప్రతి లబ్ధిదారుడికి బ్యాంకు ఖాతా ఉండేలా చూడాలని ఆదేశించారు.

పక్వానికి వచ్చిన కాఫీ పళ్లే కొనుగోలు


కాఫీ తోటలను పరిశీలిస్తున్న ఏడీ అశోక్‌కుమార్

చింతపల్లి రూరల్: గిరిజన రైతులు సాగు చేస్తున్న తోటల్లో పక్వానికి వచ్చిన నాణ్యమైన కాఫీ పండ్లను సేకరించి వేరుగా నిల్వ చేయాలని కాఫీ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి, కాఫీ తోటలను పరిశీలించారు. అనంతరం ఎకో పల్పింగ్ యూనిట్‌లో రైతులతో సమావేశం నిర్వహించారు.ఐటీడీఏ ఆధ్వర్యంలో కిలో కాఫీ పండ్లను రూ.36 కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు.క్లీన్ కాఫీగా తయారు చేసి అంతర్జాతీయ మార్కెట్ ధరలకు విక్రయించి, లాభాల్లో రైతులకు బోనస్ చెల్లిస్తామన్నారు.పండ్ల సేకరణలో రైతులు నాణ్యత పాటించాలని ఆయన తెలిపారు. పక్వానికి వచ్చిన పండ్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. కాయలను సేకరించి చెర్రీగా తయారు చేసి తమకు విక్రయిస్తే కీలో రూ.135కు కొనుగోలు చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాఫీ రైతు సంఘం నాయకులు సెగ్గి కొండలరావు,కాఫీ సిబ్బంది పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.